# తెగింపు

— కె. ఉషా పద్మశ్రీ

ఆ పల్లెటూళ్ళో విశ్వపతి ఇంటి ముందు చాల హడావిడిగా వుంది. పెద్దలు, పిల్లలు సందడిగా ఇంటా, బయటా తిరుగుతున్నారు ఆరోజు విశ్వపతి కూతురు సుగుణ పెళ్ళి. సుగుణ పేరుకు తగ్గదే. విశ్వపతి మధ్య తరగతి కుటుంబీకుడే అయినా జ్యేష్ఠకుమార్తె పెళ్ళి కదా అని శక్తికి మించిన ఆర్భాటాలే చేస్తున్నాడు.

"స్టేషన్‌కు ఎవరైనా వెళ్ళారా? పెళ్ళివారు వచ్చే టైమయింది" అంటూ విశ్వపతి బయటకు వచ్చాడు. అప్పుడే వాకిట్లోకి అడుగు పెడుతున్న విశ్వపతి తమ్ముడు "ఆ వెళ్ళాను వచ్చాను, పెళ్ళివారు ఈ ట్రైన్‌లో రాలేదు మళ్ళీ విజయవాడ నుంచి వచ్చే ట్రైన్ అర్ధరాత్రి వరకు లేదట" అని చెప్పాడు దిగాలుగా. ఏమిటీ! వాళ్ళు రాలేదా? రాత్రికి పెళ్ళి కదా! వాళ్ళు ఉదయానికే వస్తామని చెప్పారే అంటూ కంగారుపడ్డాడు.

సుగుణకు కాబోయే భర్త డాక్టర్. అతన్ని చూడగానే సంస్కారవంతుడని అనుకొంది సుగుణ అతని పేరు "రాజేంద్ర కుమార్" ఆమెకు అతనిపట్ల ఏ అభిప్రాయమూ లేదు ఆమె తల్లితండ్రులకు నచ్చాడట, ఆమె పెదహాము కనుక ఎనిమిదివేల కట్నం అప్పుచేసి ఇస్తున్నాడు విశ్వపతి. అతన్ని భర్తగా పొందటం సుగుణ అదృష్టమనే భావిస్తున్నారు ఆమె తల్లిదండ్రులు, బంధువులూను.

సాయంత్రం అయింది. పెళ్ళివారు రాలేదు ఏ టాక్సీలో అయినా రాకపోతారా. అని అప్పటి దాకా ఎదురు చూశారు. విశ్వపతికి ఏంచేయడానికి తోచక కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నాడు కూడా ఉన్న బంధువులు వారికి ధైర్యం చెప్తున్నారు. విశ్వపతి తమ్ముణ్ణి పిలచి మగపెళ్ళివారి ఊరువెళ్ళి సంగతి కనుక్కురమ్మని పంపాడు.

పెళ్ళివారిల్లు అంతా వెలవెలబోతోంది. ముహూర్తం టైముదాటిపోయింది కాని పెళ్ళి జరుగలేదు విశ్వపతి భార్యపడే కంగారుకి అంతులేదు అంతలో వచ్చాడు విశ్వపతి తమ్ముడు ఉసూరుమంటూ. విశ్వపతి, భార్య అతన్ని చూస్తూనే, ఆతృతగా, కంగారుగా ఎదురువెళ్ళారు ఏమిటీ విషయం అంటూ. పెళ్ళికొడుకు చనిపోయాడట. కారణాలు సరిగా తెలియలేదు.

ఒకందుకు నయం, అతను పెళ్ళి కాని క్రితమే చనిపోయాడు అంటూ విశ్వపతి తమ్ముడు ముఖం చిందుకొని వెళ్ళిపోయాడు.

విశ్వపతి దంపతుల దుఃఖానికి అంతు లేదు. విశ్వపతి భార్య విషయం వింటూనే స్పృహ తప్పి పడిపోయింది. ఆమె ఉపచారాలు పొంది, తేరుకొంటూనే, కూతురి దురదృష్టాన్ని నిందిస్తూ. ఆమెను తిట్టింది. దరిద్రులని బాగు చేసేందుకు ఎవరి తరం? దానికి చిన్నప్పటి నుంచీ, అన్నీ విషయా

## జే జే లు

-పొత్తూరి సుబ్బారావు

ప్రజలను వీరులుగా చేసి
వీరత్వము నుగ్గుగ చేసి
రంగరించి గళమున పోసి
"వందేమాతరం" నూరిపోసి
చెమటోడ్చిన వచ్చింది
ఈనాటి స్వాతంత్ర్యం

తరతరాల స్వాతంత్ర్యమును
మంచియుక్తితో మాయంచేసి
దేశప్రగతిని ధ్వంసంచేసిన
యమదూతలకు ఎదురుపడి
శాంతియుతముగ పోరాడి
దూరతీరాలకు తరిమికొట్టిన
మన జాతిపితకు జేజేలు

భరత మాతకు జేజేలు
స్వతంత్ర్య యోధులకు జేజేలు
అమర వీరులకు జేజేలు
కీర్తిస్థాపకులకు జేజేలు

దేశప్రగతికి పాటుపడు
ప్రతి పౌరునికి జేజేలు
జేజేలు - మన జేజేలు

---

లోను అట్లాగే జరుగుతోంది. ఛీ పాపిష్టి ముఖం అంటూ ఆమెను అసహ్యించుకొంది. సుగుణ ఎంత అదృష్టవంతురాలో వర్ణించుకొన్న బంధువులే ఇప్పుడు ఆమె ఎంత దరిద్ర జాతకురాలోనని చాటుగా చెప్పుకుంటున్నారు ఊరిలో కొంతమంది మగ వారువచ్చి విశ్వపతికి ధైర్యం చెబుతున్నారు. కొందరు ఆడవాళ్ళు లోపలికి వెళ్ళి సుగుణ కేసి ఎగాదిగా చూసి, విశ్వపతి భార్యకు ధైర్యం చెప్తున్నారు

సుగుణ మాత్రం నిర్విచారంగా వుంది. ఆమెకు పెళ్ళి జరుగుతోందన్న సంతోషం లేదు.ఆగిపోయిందన్న విచారంలేదు సుగుణ ఫ్రెండ్ నిర్మల వచ్చింది, విషయం తెలిసి ఆమెను ఎప్పటిలాగే చిరునవ్వుతో ఆహ్వానించటంచూచి సుగుణకు చెప్పాలని వచ్చిన ఓదార్పుమాటలన్నీ మరచిపోయింది నిర్మల.

సుగుణ దరిద్ర జాతకురాలని ఆ పల్లెటూర్లో అంతా ఆమెను నిందించారు. ఆమె చదువులోను, అందంలోనూ అంతంత మాత్రమే పైగా దురదృష్ట జాతకురాలని పేరు సంపాదించుకొంది. అట్లాంటి ఆమెకు పెళ్ళి కావటం ఎంత కష్టమో చెప్పాల్సిన అవసరం లేదు. అయినప్పటికీ తన ప్రయత్నం మానకుండా సంబంధాలు వెతుకుతూనే వున్నాడు విశ్వపతి. ఒకరోజు నలభై ఏళ్ళ పెండ్లి కొడుకు వచ్చి సుగుణను చూచి వెళ్ళాడు. ఆ మరునాడే కబురు పంపాడు. ఆమె తనకు నచ్చినట్లు, వెంటనే ముహూర్తాలు పెట్టించమనీను.

"ఎదో గంతకు తగ్గ బొంత" అంటూ సుగుణ తల్లి తండ్రులు" ఈ పెళ్ళిఅయినా సక్రమంగా జరగనీ" భగవంతుడా! అనుకొంటూ అనేక దేవుళ్ళకు మ్రొక్కుకొన్నారు రేపు ఉదయమే పెళ్ళి అనగా మగ పెళ్ళి వారంతా ఈ సాయంత్రానికే వచ్చి విడిదిలో దిగారు.

"సుగుణ ఏదీ? మంగళ స్నానాలు చేయించాలి" అంటూ సుగుణ తల్లి ఇల్లంతా వెతుకుతోంది. ఆమెకు ఎక్కడా కనబడ లేదు సుగుణ అందరూ కంగారుగా వెదికారు.

నిర్మల లేస్తూనే తనబెడ్ రూమ్‌లో

# కోరిక

— కుమారి కాద సరోజారాణి

తారను నేనైతే....!
నీలాల నింగిలో
మిల మిలా మెరయుచు
తిమిరాన్ని నిమిషంలో
తళ తళ లాడింతు —

* * *

గీతిక నేనైతే....!
నాదాలలో లేని
గీతాలు పలికించి
మదిలోన ఎనలేని
రాగాలు పండింతు —

* * *

మబ్బును నేనైతే....!
నింగి అంచుల పైన
తొంగి తొంగి చూచి
ముత్యాల జల్లులను
ముచ్చటగ కురిపింతు —

* * *

గువ్వను నేనైతే....!
ఆకాశ వీధిలో
హాయిగా విహరించి
అంతులేని ఈ లోక
వింతలను తిలకింతు —

* * *

కోకిల నేనైతే....!
తీయనైన గొంతెత్తి
తేనెలను ఒలికించి
అన్ని వేళలలోను
వసంతాన్ని చిలికింతు —

* * *

పుష్పము నేనైతే....!
వనమంతా అలరించి
కనుల కింపొసగి
జగమేలు ఆ 'తల్లి'
సిగలోన నివసింతు —

---

కిటికీ దగ్గరగా తెల్లటి కాగితం రెప రెప లాడు తుంటే వెళ్ళి చూసింది.

డియర్ నిర్మలా ;

నేను వెళ్ళిపోతున్నాను. ఎక్కడికి వెళు తున్నానో నాకే తెలియదు. ఆ మొదటి పెళ్ళి కొడుకు చనిపోవటం, నా తప్పు అన్నట్లుగా వన్నందరూ నిందిస్తుంటే ఇంతవరకు భరించాను, కాని అతని చావుకు నేనెంత వరకు కారణం? నేను దురదృష్టవంతురాలనే కావచ్చు కాని నా తప్పు ఏమీలేదు కదా! కన్న తల్లితండ్రులే నిందిస్తుండగా, ఇక బైటివారు నిందించారని వాళ్ళమీద కోపం తెచ్చుకోవటంలో అర్థంలేదుకదా! నాకసలు పెళ్ళిఇష్టంలేదు. కాని నేనింతవరకు ఎవరికీ ఎదురు తిరగకుండా బ్రతికాను. కాని ఇప్పుడలాకాదు నేనిప్పుడు సర్వస్వతంత్రురాలిని. నా చదువుకు తగ్గ ఉద్యోగంచేసి నన్ను నేను పోషించుకోగలను.

పేపర్‌లో ఒక కాన్వెంట్ స్కూల్లో టీచర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు చూచి అప్లికేషన్ పంపాను, ఇంటర్వ్యూ వచ్చింది. సెలక్టు అయ్యాను. రేపు ఉద్యోగంలో చేరుతున్నాను. నేను చేసుకొన్న అదృష్టమల్లా నిన్ను ఫ్రెండ్‌గా పొందటమే దయచేసి నా ఉనికి నా తల్లిదండ్రులకు చెప్పకు. పిల్లి ఎంత పిరికిదైనా, సమయం వస్తే దేన్నీ లెక్కచెయ్యదు. ఇప్పుడు నేనూ అదేస్థితిలో వున్నాను. నాలో ఈ తెగింపు చూసి నువ్వు చాల ఆశ్చర్యపడినా, నేను మాత్రం బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను.

ఇట్లు,

ప్రియ సుగుణ."